క్లుప్తంగా

ఇందిరమ్మ ఇళ్ల పరిశీలన



వాజేడు: మండల పరిధిలోని పేరూరు గ్రామంలో ఇందిరమ్మ ఇళ్లను ఇన్‌చార్జ్ ఎంపీడీఓ శ్రీకాంత్ నాయుడు మంగళవారం పరిశీలించారు. లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి నిర్మాణాలను చూశారు. లబ్ధదారులు నిర్మాణాలను త్వరగా పూర్తి చేయాలని సూచించారు.

అంగన్‌వాడీ సెంటర్‌లో తల్లిపాల వారోత్సవాలు



వెంకటాపురం(కె): మండల పరిధిలోని చర్పిపేట అంగన్‌వాడీ సెంటర్‌లో టీచర్ రాజేశ్వరి ఆధ్వర్యంలో మంగళవారం తల్లి పాల వారోత్సవాలను నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్తులకు తల్లిపాల ప్రాముఖ్యతను వివరించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్స్ నాగలక్ష్మి, సరస్వతి, వాణి ఉన్నారు.

పద్మశాలి సంఘం మండల అధ్యక్షుడి ఎన్నిక



ఎస్ఎస్‌తాడ్వాయి: మార్కండేయ పద్మశాలి సంఘం మండల అధ్యక్షుడిగా బీరెల్లి గ్రామానికి చెందిన దాసరి శివానంద్‌ను ఎన్నుకున్నట్లు జిల్లా అధ్యక్షుడు కల్యాణపు వేణుగోపాల్ తెలిపారు. మంగళవారం బీరెల్లి గ్రామంలో మండల పద్మశాలి మండల కమిటీ ఎన్నిక నిర్వహించారు. ఉపాధ్యక్షులుగా కుర్రిపోశాలు కందగట్ల సాంబయ్య, ప్రధాన కార్యదర్శిగా న్యాతని రామ్మోహన్, సహ కార్యదర్శులుగా చిదిరాల రవికుమార్, గడదాసు సత్యనారాయణ కోశాధికారిగా గోరంట్ల అశోక్‌లతోపాటు కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నట్లు తెలిపారు. నూతన అధ్యక్షుడిని సంఘం నాయకులు సన్మానించారు. ఈ కార్యక్రమంలో సత్యం, సురేష్, సురేష్ బెజ్జూరి వెంకన్న, సతీష్, వెంకటేశ్వర్లు, శ్రీకాంత్, సురేష్, లక్ష్మీనారాయణ ప్రవీణ్, ముకుందస్వామి, చరణ్, రామ్మూర్తి, అనిరుద్ పాల్గొన్నారు.

మద్యంతాగి వాహనాలు నడపొద్దు

మంగపేట: మద్యం సేవించి వాహనాలను నడిపితే చట్టపరమైన చర్యలు తప్పవని ఎస్సై టీవీఆర్ సూరి హెచ్చరించారు. పోలీస్‌స్టేషన్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మద్యం సేవించి వాహనాలు నడపడం ప్రమాదకరమన్నారు. ఇటీవల డ్రంకెన్‌డ్రైవ్ చేస్తూ పట్టుబడిన 29 మందిని మంగళవారం కోర్టులో హాజరుపరిచినట్లు తెలిపారు. వీరికి రూ.35,000 జరిమానా, ఆరుగురికి మూడు రోజులు జైలు శిక్ష విధించినట్లు ఎస్సై వెల్లడించారు. మద్యం సేవించి వాహనాలు నడిపినా, ట్రాఫిక్ నిబంధనలు అతిక్రమించినా శిక్షార్హులు అవుతారని ఆయన హెచ్చరించారు.

కాస్తులో ఉన్న రైతులకు పట్టాలు అందించాలి



వెంకటాపురం(ఎం): గత 40 ఏళ్లుగా కాస్తులో ఉంటూ సాగు చేసుకుంటున్న భూములకు పట్టాలివ్వాలని మండల కేంద్రానికి చెందిన రైతులు వెంకటాపురం తహసీల్దార్ గిరిబాబుకు వినతిపత్రం అందించారు. మండల కేంద్ర శివారులోని 368, 134, 545 సర్వే నంబర్లలోని భూములను పోడు చేసుకొని సాగు చేసుకుంటుండగా అటవీశాఖ అధికారులు తమపై కేసులు పెట్టి జైలుకు పంపించారని తెలిపారు. భూమినే నమ్ముకొని జీవిస్తున్న తమకు భూమిపై హక్కులు కల్పించి పట్టాపాస్ బుక్కులు అందించాలని వినతిపత్రంలో కోరారు. కార్యక్రమంలో రైతులు నరెడ్ల వేణు, సాద సమ్మయ్య, లోకుల రవి, జనగాం రజిత, దాసరి సరోజన, సిద్ధం మొగిలి, సాద రాములు, జనగాం సాంబయ్య తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు అభినందన

కాటారం: మహాముత్తారం మండలంలోని మాదారం గిరిజన ఆశ్రమ ఉన్నత పాఠశాల విద్యార్థులు అనిల్, రంజిత్ ఇటీవల జిల్లా కేంద్రంలో నిర్వహించిన అథ్లెటిక్స్ పోటీల్లో ప్రతిభ కనబర్చి రాష్ట్ర స్థాయిపోటీలకు ఎంపికయ్యారు. దీంతో హెచ్ఎం స్వరూప, పీడీ జితేందర్ నాయక్ విద్యార్థులను మంగళవారం అభినందించారు. ఉపాధ్యాయులు దివ్యశ్రీ, అంజయ్య, రమేశ్, పూర్ణ చంద్రశేఖర్, శ్రీశైలం, రాజు, విశ్వనాథం, తదితరులు పాల్గొన్నారు.

అవస్థల నడుమ అంగన్‌వాడీ



అంగన్‌వాడీ భవనం



పగిలిన గదిగోడలు, గచ్చు

- శిథిలావస్థకు చేరిన భవనం
- మరమ్మతులు చేపట్టని వైనం
- అద్దె ఇంట్లో నిర్వహణ

వాజేడు: మండల పరిధిలోని నాగరం గ్రామంలో ఉన్న అంగన్‌వాడీ భవనం శిథిలావస్థకు చేరుకుంది. ఈ కేంద్రంలో సుమారుగా 20 మంది చిన్నారులు ఉన్నారు. భవనం గోడలు పగుళ్లు తేలి ప్రమాదకరంగా మారింది. తలుపులు ఊడిపోవడంతోపాటు ఫ్లోరింగ్ పాడైపోయింది. ఈ విషయాన్ని అంగన్‌వాడీ టీచర్ సీత గతంలో ఎంపీడీఓగా పని చేసిన విజయ దృష్టికి తీసుకెళ్లగా భవనాన్ని పరిశీలించారు.

మరమ్మతు చేయని వైనం

అంగన్‌వాడీ కేంద్రం భవనాన్ని మరమ్మతు చేసి పిల్లలకు ఎలాంటి ఇబ్బంది లేకుండా చూడాల్సిన అధికారులు పట్టించుకోకపోవడం గమనార్హం. ఏ సమయంలోనైనా గోడలు కూలిపోయే ప్రమాదం ఉంది. దీంతో కొన్నిరోజులపాటు తల్లిదండ్రులు తమ పిల్లలను అంగన్‌వాడీ కేంద్రానికి పంపించలేదు.

అద్దె ఇంట్లో నిర్వహణ

ప్రమాదం పొంచి ఉన్న భవనంలో అంగన్‌వాడీ కేంద్రాన్ని నిర్వహించడం ప్రమాదకరమని భావించిన టీచర్ ఐసీడీఎస్ ఉన్నతాధికారులకు సమాచారం అందించింది. వారి సూచన మేరకు అద్దె ఇంట్లో అంగన్‌వాడీ కేంద్రాన్ని నిర్వహిస్తుంది. అయితే అంగన్‌వాడీ కేంద్రం భవనం నిరుపయోగంగా ఉండడంతో చుట్టూ పిచ్చిమొక్కలు, గడ్డి ఏపుగా పెరిగి అధ్వానంగా మారింది. సొంతభవనం ఉన్నప్పటికీ అద్దె ఇంట్లో కేంద్రాన్ని నిర్వహించే ఇబ్బంది లేకుండా అంగన్‌వాడీ భవనానికి మరమ్మతులు చేయించాలని చిన్నారుల తల్లిదండ్రులు, స్థానికులు కోరుతున్నారు.

ఎన్నికల హామీలను నెరవేర్చాలి

- ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రమేష్



పాలంపేటలో మాట్లాడుతున్న రమేష్

వెంకటాపురం(ఎం): ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన హామీలను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నెరవేర్చాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు చాతళ్ల రమేష్ డిమాండ్ చేశారు. మంగళవారం మండలంలోని పాలంపేటలో వీహెచ్‌పీఎస్ సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు. దివ్యాంగులు, వృద్ధులు, వితంతువులకు రూ.6 వేలు పింఛన్ అందించాలన్నారు. అందాల పోటీలకు రూ.వేల కోట్లు ఖర్చుపెట్టిన కాంగ్రెస్ ప్రభుత్వం పేదల సమస్యలను పట్టించుకోవడం లేదని విమర్శించారు. ఈనెల 13న హైదరాబాద్‌లోని ఎల్బీ స్టేడియంలో నిర్వహించే మహాగర్జన మహాసభకు ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ, వీహెచ్‌పీఎస్ నాయకులు, వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులు తరలిరావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు తడుగుల విజయ్, కల్లెపల్లి రమేష్, వీహెచ్‌పీఎస్ నాయకులు మూల రాజయ్య, మండ కొమురయ్య, గోపాల్, సందీప్, రాజు పాల్గొన్నారు.

ఆరోగ్యంపై ప్రజలకు అవగాహన కల్పించాలి



మాట్లాడుతున్న ఎంపీడీఓ శ్రీకాంత్

వాజేడు: ఆరోగ్యంపై ప్రజలకు అవగాహన కల్పించాలని వాజేడు ఇన్‌చార్జ్ ఎంపీడీఓ శ్రీకాంత్ నాయుడు అన్నారు. మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మంగళవారం ఆశ డే కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ గ్రామ పంచాయతీ, వైద్య, ఆరోగ్య, ఆశ కార్యకర్తలు కలిసికట్టుగా కృషి చేస్తే ప్రజలకు ఎలాంటి అనారోగ్య సమస్యలు తలెత్తవన్నారు. ప్రజలను వ్యాధులకు గురి కాకుండా కాపడం కోసం పరిసరాల పరిశుభ్రతతోపాటు గుంతల్లో ఉన్న నీటిని తొలగించడం ఆయిల్ బాల్స్ వేయడం వంటి చర్యలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో వాజేడు వైద్యాధికారి మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

సబ్ సెంటర్ సేవలు వినియోగించుకోవాలి



మాట్లాడుతున్న డాక్టర్ మహేందర్



కేక్ కట్ చేస్తున్న డాక్టర్ తదితరులు

- వైద్యాధికారి మహేందర్

వాజేడు: సబ్ సెంటర్ సేవలను ప్రజలు వినియోగించుకోవాలని వైద్యాధికారి మహేందర్ అన్నారు. మండల పరిధిలోని ఏడ్జెర్లపల్లి గ్రామంలో గత సంవత్సరం ఆగష్టు 5న మంత్రి సీతక్క కంటైనర్ సబ్ సెంటర్‌ను ప్రారంభించారు. ఏడాది పూర్తయిన సందర్భంగా స్థానిక ప్రజలతో కలిసి డాక్టర్ మహేందర్ కేక్ కట్ చేసి, మాట్లాడారు. మారుమూల ప్రజల సౌకర్యార్థం ఏర్పాటు చేసిన సబ్ సెంటర్‌ను ఉపయోగించుకోవాలని చెప్పారు. ఆరోగ్య సమస్యలు తలెత్తిన వెంటనే సబ్ సెంటర్‌కు వచ్చి వివరాలను నమోదు చేసుకుని వైద్యం పొందాలన్నారు.

నులిపురుగుల నివారణకు కృషి చేయాలి



ఆశ డే కార్యక్రమంలో పాల్గొన్న సిబ్బంది

వెంకటాపురం(కె): నులిపురుగుల నివారణకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని ఎదిర వైద్యాధికారి క్రాంతి కుమార్ అన్నారు. మండల పరిధిలోని ఎదిర వైద్యశాలలో ఆశ డే కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 11న నిర్వహించే నులిపురుగుల నివారణ దినోత్సవాన్ని విజయవంతం చేయాలని పేర్కొన్నారు. నులుపురుగుల నివారణ మాత్రాలు 1 నుంచి 19 సంవత్సరాల పిల్లలకు అందించాలని అన్నారు. మండలంలోని అన్ని అంగన్‌వాడీ కేంద్రాలు, ప్రభుత్వ పాఠశాలు, జూనియర్ కాలేజీలు, ప్రైవేట్ పాఠశాలల విద్యార్థులకు మాత్రలను వేయాలన్నారు. ఆశాలు గ్రామాల్లో ప్రతి రోజు ఇంటింటి సర్వే చేసి జ్వరపీడితులను గుర్తించి వారికి రక్త పరీక్షలు చేయించాలన్నారు. అవసరం ఉన్నవారికి మందులను అందజేయాలని చెప్పారు. కార్యక్రమంలో డీపీఎంఓ సత్యనారాయణ, హెచ్ఈఓ సత్యనారాయణ, హెచ్‌వీ రామలక్ష్మి, తదితరులు ఉన్నారు.

వరంగల్ పాదయాత్రను జయప్రదం చేయండి



ఏఓకు వినతిపత్రం అందజేస్తున్న ఉద్యమకారులు

ములుగు రూరల్: తెలంగాణ ఉద్యమకారుల ఫోరం ఆధ్వర్యంలో రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ఈ నెల 11న వరంగల్‌లో నిర్వహించనున్న పాదయాత్రను జయప్రదం చేయాలని టీయూఎఫ్ ఉమ్మడి వరంగల్ జిల్లా కన్వీనర్ సంధగిరి రజినీకాంత్ పిలుపునిచ్చారు. జిల్లా కేంద్రంలోని రిటైర్డు ఉద్యోగుల భవనంలో మంగళవారం మురహరి భిక్షపతి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశానికి రజినీకాంత్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ప్రభుత్వం ఉద్యమకారులకు ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి 20 నెలలు అవుతున్నా ఉద్యమకారులను పట్టించుకోకపోవడం దారుణమని అన్నారు. ఉద్యమకారులకు న్యాయం చేయాలని కోరారు. అనంతరం పలు డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని కలెక్టర్ కార్యాలయం ఏఓ రాజ్‌కుమార్‌కు అందజేశారు. కార్యక్రమంలో ఒడపెల్లి శ్యాం, మోహన్, జయ, భద్రయ్య, ఏడుకొండలు, సంజీవ, రాణి, సంధ్యారెడ్డి, శ్రీనివాస్, భిక్షపతి, సర్దార్ పాష, ఫాతిమ, పూలమ్మ, సుగుణ, గట్టయ్య, కృష్ణమూర్తి, సదయ్య, వేణు, శ్రీధర్, రవి తదితరులు పాల్గొన్నారు.

ఆదివాసీ దినోత్సవాన్ని గ్రామ గ్రామాన నిర్వహించాలి

- పూనెం రాంచందర్



మాట్లాడుతున్న పూనెం రాంచందర్

వాజేడు: ఆదివాసీ దినోత్సవాన్ని ఆగస్టు 9న గ్రామ గ్రామాన నిర్వహించాలని తెలంగాణ భూమిపుత్ర ఆదివాసీ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పూనెం రాంచందర్ పిలుపునిచ్చారు. మండల కేంద్రంలో మంగళవారం సంఘం ముఖ్యకార్యకర్తల సమావేశం నిర్వహించగా ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. ఐక్యరాజ్య సమితి 1994 ఆగష్టు 9ని ప్రపంచ ఆదివాసీ దినోత్సవంగా గుర్తించిందని గుర్తు చేశారు. ప్రపంచ ఆదివాసీ దినోత్సవం కోసం అన్ని ఆదివాసీ సంఘాల నాయకులు, ప్రజలు భారీ సంఖ్యలో పాల్గొనాలని కోరారు. ప్రతీ గ్రామంలో ఆదివాసీ జెండా ఎగరాలని పిలుపునిచ్చారు. ఆదివాసీలు ఐక్యంగా ఉంటేనే హక్కులు సాధించుకోగలమని పేర్కొన్నారు. ఇదే సమయంలో మండల పరిధిలోని చెరుకూరు గ్రామంలోని పోచమ్మగుడి ఆవరణలో పలు ఆదివాసీ సంఘాల నాయకులు సమావేశాన్ని ఏర్పాటు చేసి మాట్లాడారు. పండగ వాతావరణంతో గ్రామ గ్రామాన ఆదివాసీ దినోత్సవాన్ని జరుపుకోవాలన్నారు. కార్యక్రమాల్లో బుచ్చయ్య, చింత మోహన్, మల్లికార్జున్, మనోజ్, నర్సింహారావు, లక్ష్మణ్, ఆదినారాయణ, సందీప్, రోహిత్, సాయి తదితరులు ఉన్నారు.

బెటాలియన్ కానిస్టేబుల్ బలవన్మరణం

- రెండు రోజుల తర్వాత గుర్తించిన వైనం



బాలరాజు (ఫైల్)

సత్తుపల్లిరూరల్: ఖమ్మం జిల్లా సత్తుపల్లి మండలం గంగారం ప్రత్యేక పోలీస్ బెటాలియన్‌లో విధులు నిర్వర్తించే కానిస్టేబుల్ కుటుంబ కలహాలకు తోడు మద్యానికి బానిసవడంతో ఆత్మహత్య చేసుకున్నాడు. ములుగు జిల్లా కేంద్రానికి చెందిన అల్లం బాలరాజు(40) సత్తుపల్లి మండలం బేతుపల్లిలో అద్దె ఇంట్లో నివాసముంటూ గంగారం బెటాలియన్‌లో విధులు నిర్వర్తిస్తున్నాడు. ఏడాది క్రితం భార్యాభర్తల మధ్య వివాదంతో భార్య.. పిల్లలతో కలిసి పుట్టింటికి వెళ్లిపోయింది. ఆపై మద్యానికి బానిసైన బాలరాజు మత్తులోనే రెండు రోజుల క్రితం నివాస ముండే గదిలో ఉరి వేసుకున్నట్లు తెలుస్తోంది. మంగళవారం ఇంటినుంచి దుర్వాసన వస్తుండగా యజమాని ఇచ్చిన సమాచారంతో బెటాలియన్ సిబ్బంది పరిశీలించడంతో విషయం వెలుగు చూసింది. ఘటనపై సత్తుపల్లి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

మరుగుదొడ్ల అధ్వానం



పిచ్చిమొక్కల నడుమ నిరుపయోగంగా ఉన్న మరుగుదొడ్లు



తలుపు ఊడిపోయి బేసిన్‌లో కూరుకుపోయిన చెత్తాచెదారం

- పట్టించుకోని విద్యాశాఖ అధికారులు

ఎస్ఎస్‌తాడ్వాయి: మండలంలోని నార్లాపూర్ జెడ్పీ పాఠశాలలో మరుగుదొడ్లు అధ్వానంగా దర్శనమిస్తున్నాయి. మరుగుదొడ్ల చుట్టూ పిచ్చిమొక్కలు పెరిగిపోయాయి. మరుగుదొడ్ల తలుపులు ఊడిపోయాయి. మరుగుదొడ్లు వినియోగంలో లేకపోవడంతో పాఠశాలలోని విద్యార్థినులు మాత్రవిసర్జన కోసం బయట ప్రదేశాలకు వెళ్లాల్సివస్తుంది. కొంత మంది విద్యార్థినులు పాఠశాలకు దగ్గర ఉన్న ఇళ్లకు వెళ్తున్నారు. వర్షకాలం కావడంతో మరుగుదొడ్ల చుట్టూ పిచ్చిమొక్కలు భారీగా పెరిగి విషపురుగులకు నిలయంగా మారింది. మరుగుదొడ్లను వినియోగంలోకి తీసుకురావాల్సిన అధికారులు పట్టించుకోకపోవడంతోనే పరిస్థితి ఇలా మారిందని విద్యార్థుల తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. పాఠశాలలోని విద్యార్థుల విద్య అభివృద్ధితోపాటు సౌకర్యాలు అంతే అవసరంగా గుర్తించాల్సిన అధికారులు పట్టింపులేనట్లు వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఉన్నాతాధికారులు స్పందించి మరుగుదొడ్లను వినియోగంలోకి తీసుకురావాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

అంతర్రాష్ట్ర కూలీలకు గుర్తింపు కార్డు తప్పనిసరి



కూలీలతో మాట్లాడుతున్న సీఐ సరేష్

ములుగు రూరల్: ములుగు పట్టణ కేంద్రంలో బీహార్, ఒరిస్సా, ఉత్తరప్రదేశ్ వంటి రాష్ట్రాలకు చెందిన వలస కూలీలకు గుర్తింకార్డులు తప్పనిసరిగా ఉండాలని సీఐ సురేష్‌కుమార్ అన్నారు. ఎస్పీ శబరీశ్ ఆదేశాల మేరకు పట్టణ కేంద్రంలోని సపాయివాడలో మంగళవారం కార్డన్ సెర్చ్ చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వలస కూలీల వాహన పత్రాలను పరిశీలించారు. ఫింగర్ ప్రింట్ డివైజ్ ద్వారా వారిపై పాత కేసులను పరిశీలించారు. సంఘ వ్యతిరేక కార్యక్రమాలకు పాల్పడకుండా పనులు చేసుకొని జీవించాలని సూచించారు. అంతర్రాష్ట్ర కూలీలు దొంగతనాలకు పాల్పడే అవకాశం ఉందని అన్నారు. అనంతరం సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. ఎస్సై వెంకటేశ్వర్‌రావు, టీజీఎస్‌పీ సిబ్బంది పాల్గొన్నారు.

ట్రాఫిక్‌లో చిక్కుకున్న ప్రైవేట్ అంబులెన్స్



వెంకటాపురం(కె): మండల కేంద్రంలోని అంబేడ్కర్ సెంటర్‌లో మంగళవారం ఓ ప్రైవేట్ అంబులెన్స్ ట్రాఫిక్‌లో చిక్కుకుంది. మంగళవారం నిర్వహించే వారసంతతో రోడ్లపైనే షాపులు ఏర్పాటు చేసుకోవడం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా నుంచి ఇసుక లారీలు పెద్ద సంఖ్యలో వస్తుండడంతో ట్రాఫిక్ అంతరాయం ఏర్పడింది. అదే సమయంలో వరంగల్ నుంచి వెంకటాపురం మండల కేంద్రానికి వస్తున్న అంబులెన్స్ అరగంటపాటు ట్రాఫిక్‌లో చిక్కుకుంది. అంబులెన్స్‌లో పేషెంట్లు లేకపోవడంతో నిమ్మదిగా ఆ వాహనం అక్కడినుంచి వెళ్లిపోయింది.

ఐటీఐ, ఏటీసీ కోర్సులో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

కాటారం: మండల కేంద్రంలోని ఐటీఐ, నూతనంగా ప్రవేశ పెట్టిన ఏటీసీ కోర్సుల్లో ప్రవేశం కోసం విద్యార్థుల నుంచి రెండో విడతలో దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ భిక్షపతి మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఎన్‌సీవీటీ ప్యాట్రన్‌లో ఎలక్ట్రిషియన్ విభాగం, ఫిట్టర్ విభాగం, ఏటీసీలో మ్యానుఫ్యాక్చరింగ్ ప్రాసెస్ కంట్రోల్ ఆటోమేషన్ (ఏడాది కోర్సు), ఇండస్ట్రియల్ రోబొటిక్ అండ్ డిజిటల్ మ్యానుఫ్యాక్చరింగ్ టెక్నీషియన్(ఏడాది కోర్సు), ఆర్టీసీఎస్ యూజింగ్ అడ్వాన్స్ టూల్(ఏడాది కోర్సు), బేసిక్ డిజైనర్ అండ్ వర్చ్యువల్ వెరిఫియర్ మెకానికల్ (2సంవత్సరాలు), అడ్వాన్స్‌డ్ సీఎంసీ మిస్సింగ్ టెక్నీషియన్ (2 సంవత్సరాలు), మెకానిక్ ఎలక్ట్రిక్ వెహికిల్(2 సం) విభాగాల్లో సీట్లు ఖాళీగా ఉన్నట్లు పేర్కొన్నారు. అభ్యర్థులు ఆన్‌లైన్ ద్వారా ఈ నెల 28 వరకు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ సూచించారు.

కేంద్ర ప్రభుత్వ పథకాలపై ప్రచారం



ఇంటింటి ప్రచారం నిర్వహిస్తున్న నాయకులు

ములుగు రూరల్: మహాసంపర్క్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా మల్లంపల్లి మండల కేంద్రంలో మంగళవారం కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలపై ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు చింతలపూడి భాస్కర్ రెడ్డి హాజరయ్యారు. గ్రామంలో ఇంటింటికీ వెళ్లి అభివృద్ధి పనుల స్టిక్కర్లను అతికిస్తూ సంక్షేమ పథకాలపై ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కరోనా సమయం నుంచి ఉచిత బియ్యం, రైతు వేదికలు, పల్లె ప్రకృతి వనాలను కేంద్ర ప్రభుత్వ నిధుల నుంచే ఏర్పాటు చేశారని వివరించారు. కార్యక్రమంలో జిల్లా కౌన్సిల్ మెంబర్ రాకేష్ యాదవ్, దుంగిడి వెంకన్న, హరీశ్‌గౌడ్, బండి బాబు, బైకాని మహేందర్, పోతురాజు, రమేష్ తదితరులు ఉన్నారు.

విద్యార్థులకు టై, బెల్టు, ఐడీ కార్డుల అందజేత



విద్యార్థులకు టై, బెల్టులను అందజేస్తున్న దాతలు

మంగపేట: ప్రవాస భారతీయులైన ముప్పిడి సుష్మితారెడ్డి, జయంతి రెడ్డి దంపతుల జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని రూ.20,000 విలువైన ఐడీ కార్డులు, టై, బెల్టులను మంగళవారం మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలోని విద్యార్థులకు అందచేశారు. ఈ సందర్భంగా దాతలు మాట్లాడుతూ ఏజెన్సీలోని విద్యార్థులకు సేవ చేయడం అదృష్టంగా భావిస్తున్నామన్నారు. విద్యార్థులు శ్రద్ధతో చదువుకుని ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. సుష్మితారెడ్డి తండ్రి దామోదర్‌రెడ్డి మాట్లాడుతూ.. వార్షిక పరీక్షల్లో ప్రథమస్థానంలో ఉత్తీర్ణత సాధించిన వారికి రూ.1,000, ద్వితీయ స్థానంలో నిలిచినవారికి రూ.500 ప్రోత్సాహకంగా అందచేస్తామని ప్రకటించారు. సహకరించిన నారాయణరెడ్డి, సానికొమ్ము వెంకటేశ్వర్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఎంఈఓ పాదెం మేనక, ఉపాధ్యాయులు, క్రాంతి, చంద్రశేఖర్, నాగేందర్, నాగేశ్వర్‌రావు, అనంతరావు, నాగేందర్, సతీష్, పూర్ణ తదితరులు పాల్గొన్నారు.



బ్యాగులు పంపిణీ చేస్తున్న ఎంఈఓ, ఎస్సై

గ్రేస్ సేవలు అభినందనీయం

ఏజెన్సీ ప్రాంత మారుమూల గ్రామీణ ప్రాంతాల్లోని పేద విద్యార్థులు చదువుకునేందుకు ప్రోత్సహిస్తూ సహకారం అందిస్తున్నన్న గ్రేస్ సర్వీస్ సొసైటీ స్వచ్ఛంద సేవాసంస్థ సేవలు అభినందనీయమని ఎంఈఓ పాదెం మేనక అన్నారు. మండలంలోని పాతనర్సాపురం, గంపోనిగూడెం, అబ్బాయిగూడెం, తిమ్మంపేట, బాలన్నగూడెం, శనిగకుంట, నర్సింహాసాగర్, నరెందర్‌రావుపేటలోని ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకుంటున్న 350 మంది పేద విద్యార్థులకు స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో స్కూల్ బ్యాగులు, పెన్నులు, నోట్ పుస్తకాలు, పలకలను ఎంఈఓ మేనక, ఎస్సై శ్రీకాంత్ చేతులమీదుగా మంగళవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పేదవిద్యార్థులకు చేయూతనందించడం సంతోషకరమన్నారు. ఇలాంటి స్వచ్ఛంద సంస్థల స్ఫూర్తిగా మరిన్ని సంస్థలు ముందుకు రావాలని కోరారు. జీఎస్ఎస్‌కే పుల్లారావు, ఏసుబాబు, నగేష్, లక్ష్మణ్, రమేష్ పాల్గొన్నారు.